# దయచేసి చంపెయ్యండి!

ఇచ్ఛాపురపు రామచంద్రం

తలుపులు వేసేసి వెళ్ళిపోదామనుకుంటున్నాను. సరిగ్గా నేను లేవబోతూంటే వొచ్చాడతను.

"డాక్టర్ !"

"యస్...." చెప్పమన్నట్లు చూశాను.

"నాకు కొంచెం పొటాషియం సయనైడ్ యివ్వగలరా ?"

"సా...రీ..." చెబుతూ చూశాను. "ఎవరినేనా హత్య చేద్దామనుకుంటున్నారా ?" కటువుగా అడిగాను.

"మీరెలా గ్రహించారు ?" తెల్లబోతూ అడిగాడు. నేను నవ్వేశాను.

అతనొకనిముషం మౌనంగా ఉండి.... "నిజంగా వాడొట్టి పూర్ ఫెలో అతను ఇథనేషియా కన్నివిధాలా అర్హుడే. వాడు చచ్చిపోవాలి. కాని ఉత్త పిరికివాడు. నూతిలోదూకితే కప్పలు కరుస్తాయేమో అని భయం కరంటుయితే వొళ్ళు కాలుతుందనీ.... రైలుకింద తలపెడితే రక్తం వొస్తుందని,. ఉరిపోసుకుంటే మెడ నొప్పెడుతుందని.. భయపడుతున్నాడు. అటువంటి వాడికి ఇథనేషియాకంటే నుంచి దేముంటుంది?"

"అతనిమీద మీ దయకు చాలాసంతోషం. కాని.. మీరనుకున్నట్లు ఇథనేషియాకి సరయిన. అర్థం మెర్సీకిల్లింగ్ కాదు. బాధలేని చావు"

"అదే...." సర్దుకున్నాడతను. "ప్లీజ్....డాక్టర్ !... ఎలాగయినా అతన్ని కొంచెం మెత్తగా - బాధలేకుండా చంపేద్దురూ...మీకు చాలా పుణ్యముంటుంది." బ్రతిమాలాడు.

"ఎవరతను ?"

"దగాపడిన తమ్ముడు."

"ఎవరు దగా చేశారు ?"

"ఒకరేమిటి అందరూను. మొట్టమొదట విద్య."

విద్య !.... నేను కాలేజీలో చదువుతున్నప్పుడా పేరుతో ఓ అందమయిన అమ్మాయుండేది. నేను ఆమెకు ప్రేమలేఖ వ్రాశాను కూడా. కాని - అదృష్టవంతుణ్ని. దెబ్బలు తినలేదు. వాళ్ల తండ్రి పోలీసాఫీసరుట.

"బళ్లో వేసింది మొదలు - విశ్వవిద్యాలయం యింకబయటకు పో" అని ప్రపంచంలోకి తరిమేసే వరకూ అమ్మా నాన్నా బంధువులూ...మాస్టర్లూ — అందరూ ఒకటే మాట -

"బాగా చదువుకో, వృద్ధిలోకి వస్తావు. మంచి మార్కులు తెచ్చుకో, గొప్పవాడివౌతావు. చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకుని సుఖపడు' వ్రేరిపేరు. నిజమే అనుకుని....గుర్రెద్దుచేలో పడ్డట్లు ఒకటే చదువు. పగలూ రాత్రీ చదువే. ఒక్క నిముషం పుస్తకం వొదిలి ప్రపంచమేమిటో చూసేవాడు కాడు. క్లాసులో ఫస్టు మార్కులు. యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ ....వాడివే...."

"ఇకనేం ?"

"చదువు పరుగులో ఏం కోల్పోయాడో - చదువయ్యాక తప్ప తెలియలేదా యిడియట్‌కి "

"ఏం తెలిసిందప్పుడు ?" మామూలుగా అడిగాను.

"చదువు - ఉద్యోగమివ్వదు. ఉద్ధరించదు. బ్రతకడం నేర్పదు...."

ఐతే - చదువెందుకు ?" ఆశ్చర్యంగా అడిగాను.

"చదువు - చదువెందుకు కొరగాదో తెలుసుకుందుకే." - ఓసారాగి - "చదువు కున్న వాడి కంటె చాకలి మేలు. డామ్‌కరక్ట్. అతగాడి కంటె చాలా చిన్నవాడు వాళ్లచాకలి. వాడేమీ చదువు కోలేదు. అందుకనే అమ్మా నాన్నలనీ ఓ పెళ్లాన్నీ పోషించగలుగుతున్నాడు. వాణ్ని చూస్తే - మావాడికి తను చదువుకోసం తగలేసినడబ్బు....కాలం త్యాగంచేసిన సరదాలు - అన్నీ గుర్తుకొచ్చి - అసూయ వేస్తుంది. తనెంత వెర్రివెధవ పనిచేశాడా అని ఏడుపొస్తుంది."

"అందుకేనా....పోస్టుగ్రాడ్యుయేట్ విత్‌గోల్డ్ మెడల్ అయినా ఉద్యోగం రాలేదనేనా మీవాడు చచ్చిపోవాలను కుంటున్నది ?"

"ప్రాక్సిమేట్ (అసలు) కాజ్ అదే అనుకోండి. కాని....నిజానికి - రోగబాధ కంటె లింగబాధ అధికం అన్నట్లు-నిరుద్యోగం తాలూకు బైప్రొడక్ట్స్ ఉన్నాయి చూశారూ....అవే ఎక్కువ"

"ఏమిటవి?"

"తల్లిదండ్రులమీద ఆధారపడటం....నాన్నని డబ్బులడగడానికభిమానపడి-కొన్నిటికి దరఖాస్తులు కూడా పంపడం మానేశాడు. ఇంటర్వ్యూనుంచి రాగానే-'ఈసారయినా నీమీదపెట్టిన పెట్టుబడికి ఫలితముంటుందా?' అన్నట్లుంటాయిట వాళ్ళ నాన్నచూపులు. ఇంకా ఎన్నాళ్ళు మామీదపడి తింటావు, మమ్మల్ని పోషించాల్సిందిపోయి-అన్నట్లు చూస్తుంది అమ్మ."

"ఛ ఛ....అమ్మ... నాన్నా అలా చూస్తారంటే నేన్నమ్మను."

"చూడండి .... నిరుద్యోగులపట్ల సెంటిమెంట్లుండవెవరికీ. అన్నట్లు యిదంతా దేనికి చెబుతున్నానో తెలుసా?"

"తెలుసు. మీ ఫ్రెండ్‌కి ఇథనేషియా రికమెండ్ చేస్తూను."

అతనికి ఉత్సాహం వొచ్చినట్లుంది నా చిరునవ్వుతో. కొంచెం-కుర్చీలోంచి నా ముందుకువొంగి-"మీకు దారుణమయిన రహస్యమొకటి చెప్పనా?" అన్నాడు. చెప్పమన్నాను.

"వాడి మనసు కుళ్ళిపోయింది. రోడ్డుమీదో మరెక్కడో వయసులో ఉన్న దంపతులు కంటపడితే-వాడు దెయ్యంలా ఐపోతాడు. తన యీడువాడే అయిన ఆ యువకుణ్నివతలకు లాగేసి తను ఆమెచుట్టూ చెయ్యివేసి....అలాగ..."

జాలివేసింది. నిరుద్యోగి ఐనంతమాత్రాన వయస్సాగదుగా? తీరని కోరికలెలాంటి వెర్రితలలేనావేస్తాయి. మెల్లగా అన్నాను-

"అలా కోరికలణచుకు ని శాడిజమ్ పెంచుకోడంకంటే..."

వాడికిమాత్రం బ్రహ్మచారిగా మిగిలిపోడం సరదానా? ఎంతబెంతట పెళ్ళి చేసుకుందామా అనే తహతహ లాడతాడు. కాని-పైసాకి టికానాలేని వాడికి పిల్లనిచ్చేదెవడు? ఏతల మాసిన తండ్రయినా యిచ్చినా - పెళ్ళంటే సిలు గ్గుడ్డలు కట్టుకుని పల్లకిలో ఊరేగడమేకాదుగా? రేపు ఆ పెళ్లానికి పూలు కొనాలన్నా తండ్రినడగాలంటే అతని కెలా ఉంటుంది? పోనీ-ఏకొంపకేనాపోయి వేడి చల్లార్చుకొందామంటే....ప్రపంచంలో మంచిపనికి చెడ్డపనికి కూడా కావలసింది ముందు డబ్బేకద?

"నిజమే." నిట్టూర్చాను జాలిపడుతున్నట్లు.

"మావాడనుభవించిన....అదే...ఎదుర్కొన్న అవమానాలుకూడా అన్నీయిన్నీ కావు." జాలి పడుతున్నట్లే ఉందతనికంఠం.

"అవమానాలా!" నమ్మలేకపోయాను.

"ఔను.ఎమ్. కామ్.... గోల్డు మెడలిస్ట్‌ని పట్టుకుని - పిగ్ అన్న దెవరో తెలుసా?"

"తెలియదు." అన్నాను బుద్ధిగా.

మెట్రిక్యులేట్ మాత్రమే...అదీ మూడో ఛాన్సులోనో నాలుగో ఛాన్సులోనో పాసయి ఉంటాడు. కాకపోతే అతను గుమాస్తాపదవిలో ఉన్నాడు. అదీ తేడా. అదీ అతని అహం,"

"మీరలా పొడిగా చెబితే నాకెలా అర్ధమౌతుంది? - మీరు - సిగరెట్ కాలుస్తారా?" నేనండించి - ప్యాకట్ ముందుకు తోశాను.

"నో. థాంక్స్. ఒకప్పుడు....స్వర్ణయుగంలో సిగరెట్లు కాల్చేవాడిని. టీ, కాఫీలు తాగేవాడిని. ఇప్పుడన్నీ మానేశాను..."

"ఏం?"

నిరుద్యోగికవి లగ్జరీలు కనుక" నవ్వాడు.

"మీరూ నిరుద్యోగులేనా?"

"ఆఫ్‌కోర్స్.... నేను మావాడి తరపున మాట్లాడుతున్నాను. ఎందుకు ఎలా మానేశాడో తెలుసా! నెససిటీ యీజ్ ద మదరాఫ్ ఇన్‌వెన్షన్ అన్నట్లే- వేకింగ్ ఇన్ యీజీ ద ఎండాఫ్ హాబిట్. నపుంసకుడు పరమ పవిత్రుడు. ఓహ్! మనం ఇపం విడిచి లొట్టల్లో పడినట్లున్నామే.... ఆవేళ.... మహోత్సాహంతో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజికి బయలుదేరాడు మావాడు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అర్హతతో గోల్డ్ మెడలిస్టేమో - గోల్డులా వెలిగిపోతోంది ముఖం. మొదటి సారిగా ఆ కార్యాలయాన్ని దర్శించడం కదా.... అమాయకపుదశలో, అజ్ఞానపు కలలూ, ఎనిమిదిన్నరకు క్యూకట్టాడు, ఎండ మండిపోతోంది అప్పటికే - క్యూ పెరుగుతోంది. అతను చాలా వెనుకగానే ఉన్నాడంతముందుగా వొచ్చినా, తొమ్మిదిన్నర ....పది-పదిన్నర.... పదకొండు.... గుమాస్తాగారు కరుణించివేంచేశారు. వారు కుర్చీలో కూర్చోడమేమిటి.... అంతవరకూ నిరీక్షించి నిరీక్షించి అలసిపోయిన అభ్యర్థులొక్కసారి ఆతృతగా ఎగబడ్డారు. అంతే.... సదరు గుమాస్తాగారికి కోపం వొచ్చేస్తుంది...." చదువుకున్నారన్న మాటే కాని డిసిప్లిన్ లేదు. ప్రవర్తన తెలియదు. బ్రూట్స్....పిగ్స్" అంటూ అరిచాడు. మావాడూ ఆ తిట్లు తిన్నవాళ్ళలో ఒకడే. బ్రూట్.... పిగ్ మావాడు అతని మీదుకు దెబ్బలాటకు వెళ్ళేవాడే.... కాని.... మిగిలిన వాళ్ళు ఆపి- "మీకింకా కొత్త. అందుకే ఫీలాతున్నారు. రెన్యూవల్ కొచ్చినప్పుడల్లా మాకిలాటివి పరిపాటే, ఉద్యోగం దొరికే వరకూ యిటువంటి దూషణ భూషణ తిరస్కారాల కతీతంగా ఉండాలి." అని సర్దేశారు...."

"అన్యాయమే. అతనుద్యోగి కావచ్చు. వీళ్ళు నిరుద్యోగులూ తనతో అవసరం పడి వచ్చిన వారూ కావొచ్చు. అంతమాత్రాన - వీళ్ళకి.... నిరుద్యోగులకాత్మాభిమానం ఉండ కూడదన్నట్లు నీచంగా తిట్టడమేమిటి?



"సర్లెండి. ఇవి అలవాటయిపోయాయి. నిజంగా - నేనెందుకు చెబుతున్నానంటే.... మావాడి కింతకంటే చేదు అనుభవాలే ఎదురయ్యాయి. ఉజ్జోగమూ సజ్జోగమూ లేదుగా.... కరంటు బిల్లు కట్టిపెట్టిరా నాయనా అని పక్కవాటా బామ్మగారు గ్రాస్ యిన్‌సల్ట్ చేసినా దులిపేసుకోగలిగిన మావాడు -

వాళ్ళమ్మ మాటల కేడిచాడు తెలుసా"'

"ఏమన్నారావిడ ?" కుతూహలంగా అడిగాను.

"ఉద్యోగం వొచ్చాక కాఫీతాగొచ్చు. అంతవరకూ చద్దెన్నంతినరాదూ కాఫీపొడి ధర పెరిగిపోయింది. పంచదార దొరకడం లేదు."....

నిర్ఘాంతపోయాను. ఏ అమ్మయినా అలా అనగలదా ? నిజంగా ?

"సినిమాకి డబ్బులా?....అవి చూడకపోతే కొంపమునిగదు కానీ ఉద్యోగం రానీ ... చూడొచ్చు...." అన్నాడు నాన్న. విద్యోగమే తప్ప వుద్యోగం లేని నేను అడిగిన డబ్బులు - సినిమాకి కావు నిజంగా. సిగరెట్లంటే బీడీలు.... అవీ మానెయ్యాల్సివొచ్చింది బలవంతంగా....అంటే - డబ్బుల్లేక...." నవ్వాడు విషాదంగా.

"విద్యోగం ఎంత కరుణించిందో వుద్యోగం అంత కఠినత్వం చూపింది మా వాడిమీద. డాక్టర్! ప్రేమంటే ఏమిటి?" తెల్లబోయాను - అతనలా హటాత్తుగా ఆ ప్రశ్న వేసినందుకు.

"తెలీదు-" అనేశాను కన్వీనియంట్‌గా.

"నిజంగా తెలుసు మీకు.... సర్లెండి.... నేనేచెబుతాను.... మావాడి మాటలలో వయసుతోపాటు కోరిక పెరుగుతుంది. ఒకదశ వరకూ. యౌవనంలో చాలా ఉధృతంగా మనిషిని కాల్చేసేటంత తీవ్రంగా ఉంటుంది బియోలాజికల్ అర్జ్. ఔనా?"

"ఊఁ. ఇది కూడా మనిషికి. ప్రాణికి....ప్రాథమికావసరమే.

"నాగరికత పెరిగి....ప్రతిదానికీ సభ్యతనేది అడ్డుపడుతూంటుంది. కనుక బయెలాజికల్ అర్జ్....కామాన్ని తెలపడానికుపయోగించే సభ్యతా ప్రయోగమే ప్రేమ అని నేనంటే....అదే....మావాడంటే...."

"నేనుకాదనను." జాగ్రత్తగా అన్నాను.

"మావాడొక అమ్మాయిని ప్రేమించాడు. తలలు బోడులయిన తలపులు బోడు లెలాకావో. సంపాదన లేదని శృంగార వాంఛా అలాగే ఆగదుకద ?"

"ఔను."

"ముందా అమ్మాయికి తెలీదుకాబోలు....మనిషి బాగానే ఉన్నాడని ప్రేమించేసింది. నన్నడిగితే - యీ ప్రేమనేది పెద్ద హిపోక్రసీ అంటాను."

"ఎలా ?"

"అమ్మాయి ప్రేమ వెనుక పెళ్లి ఉంటుంది. అబ్బాయి ప్రేమ వెనుక కామం ఉంటుంది. ప్రేమనేది అందమైన ప్యాకింగ్ పేపరు మాత్రమే. లోపలి సరుకుని అందమైన బాహ్యరూపాన్నివ్వడమే యీ ప్యాకింగ్ పేపరు ప్రేమపని. అందుకే - పెళ్లయ్యేసరికి....మిఠాయినిచుట్టిన కాగితంలా ప్రేమ మూలపడడం.... చీపురుతో తుడిపించుకోడం....

'భార్యా భర్తల మధ్య కూడా ప్రేమ ఉంటుందికదా ?" సందేహం వ్యక్తపరిచాను.

"పోషిస్తాడు కదా అని భార్య భర్తనీ....యింటిపనీ వంటపనీ చేస్తూ సుఖపెడుతుంది కదా అని భర్తభార్యనీ భరిస్తారు. దానికీ అనురాగమనీ, ప్రేమనీ ఏవేవో పేర్లు పెడతారు. మన బ్రతుకులనిండా హిపోక్రసీ యేగా..." అని అంతలోనే మళ్లీ గుర్తుకివొచ్చినట్లు.... "మావాడి ప్రేమకథకదూ చెబుతున్నాను ?" అడిగాడు.

"ఊఁ."

"రెండు నెలల ప్రేమ అనంతరం - ఆ అమ్మాయికి అసలు విషయం తెలిసింది కాబోలు-

"నీ మొహానికి నిరుద్యోగిమొహానికి ప్రేమేమిటి...." అని ముఖం మీదే అనేసింది.

"రాధా !" ఏడుపుమొహంపెట్టేశాడు. "కూలినగోడలు కూలినట్లుండవు. మనం చేసుకున్న బాసలు...." జ్ఞాపకం చేయబోయాడు.

"ఆ పీడకలలు జ్ఞాపకం చెయ్యకు. నీకుద్యోగమూ సద్యోగమూ లేదని తెలిసినప్పుడు చేసిన పొరపాట్లవి. నువ్వేదో నన్ను పెళ్లిచేసుకుని ఉద్ధరిస్తావనుకున్నాను."

"ఉద్యోగం రాగానే పెళ్లిచేసుకుంటాను. మనని భగవంతుడు కూడా విడదీయలేడు. నామాటనమ్మురాధా..."

"నీకుద్యోగమొచ్చి నన్ను పెళ్లి చేసుకుంటావా !" విరగబడి నవ్వి.... "అప్పటికి నాకు పెళ్లే అక్కర్లేనంత ముసలి దాన్నయిపోతాను. చూడు మోహన్.... నువ్వు నన్నిక వేధించకు. నీముఖం చూపకు. అదే పది పెళ్లిళ్లునాకు. ఈ వొక్క ఉపకారమూ చెయ్యి చాలు. పొరపాట్లు ఎవరికేనా వస్తాయి -" అని వెళ్లిపోయిందామె.

మగాడి కింత కంటె అవమానం ఏంకావాలి ? నిరుద్యోగి మాత్రం మగవాడు కాడా !"

"ఎందుక్కాడు ?"

అతను తృప్తిచెందినట్లున్నాడు. ఒక్కసారి ఊపిరిపీల్చుకుని - స్థిమితపడి- "మావాడికి జన్మలో ఉద్యోగంరాదు." అని తీర్మానించేస్తున్నట్లున్నాడు.

"ఆశ - మనిషికాధారం మనిషి ఆశను వదలకూడదు.

"ఏం ఆశ ? ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో కాల్ లెటరు ఖరీదు వెయ్యి రూపాయలు. ద్రవ్యోల్బణం వల్ల యీ మధ్య యింకా పెరిగిందేమో తెలీదు. కాల్ లెటర్ ఖరీదే వెయ్యిరూపాయలయితే - అపాయింట్‌మెంట్ ఆర్డరు ఖరీదు పదివేలు పైనేఐతే ఆశ్చర్యమేముంది ?"

"లేదు -" అనవలసి వొచ్చింది.

"మానాన్నగారు.... అదే....మావాడి తండ్రి... వెయ్యిరూపాయలు కాదు కదా వెయ్యి పదిపైసలయినా వీడి మీద పెట్టడం దండుగే అని నిశ్చయానికి వొచ్చేసాడు...."

"ప్చ్...పాపం. ఆయనకీ ప్రాణం విసుగెత్తినట్లుంది."

"ఒకవేళ ఆయన ఒకటి ప్లస్ పది, వేలు ఏతంటాలు పడో తెచ్చినా మావాడి కుద్యోగంరాదు."

"అదేం ?"

"క్రిందటి వారంతోనే మావాడికి ఏజ్ బారయిపోయింది... వాళ్ల ఫాదరేమన్నాడో తెలుసా ?"

"ఊహుఁ."

"ఇక నీకుద్యోగం వచ్చేది కల్ల కానీ - హాయిగా రాగిచెంబుతోముకో- అనేశాడు. మేము ఫార్వర్డ్ క్యాస్టు వాళ్లంలెండి."

"కులవృత్తి..."

"అవెక్కడ మిగిలాయి ? కులాలని నిర్మూలించేస్తాననే ప్రభుత్వం - ఓట్లకోసం కులాలని కాపాడుతూ - కులవృత్తులని మాత్రం ధ్వంసంచేసింది కదుటండీ. దానితో....చదువుకున్న వాళ్లు రెండిటికీ చెడ్డ రేవడులయ్యారుగా !"

"ఔను." అన్నాను.

"అందుకే నేను...మావాడు....ఇరవై తొమ్మిదవ జన్మదినోత్సవంనాడు ఒక స్లోగన్ ప్రారంభించాడు."

# మొహంజోదారో

శ్రీ గజానన్ తామన్

ఉన్నపళంగా ఓ సాయంత్రం
నీ ఇంటికి వద్దామని అనుకొని,
ఇన్నాళ్ళుగా అనుకుంటూ వున్నది
విడమరచి నీకు చెప్పాలని అనుకొని,
భయాలను సందేహాలను ప్రక్కకునెట్టి
ప్రయాన కోర్చి చేరుకొన్నాను నీ ఊరును.
నీ ఊళ్ళో ఉన్నవాళ్ళు కాస్త కూస్త
ఉన్నవాళ్ళలా కనిపించారు.
మననే బలహీనత కలవాళ్ళు మాత్రం
మరీ అరుదనే అనిపించారు.
ఒళ్ళంతా కళ్ళు చేసుకుని,
నీ ఆచూకీని గురించి ప్రశ్నించినప్పుడు
తెలుసు — తెలీదులకు మధ్య స్థితిని
తెలివిగా ఆశ్రయించారు.
వారు సూచించిన దిశలు, త్రోవలు, సంకేతాలు
పథికుణ్ణి గమ్యానికి చేర్చనివే అయినా,
పొగమంచు దట్టంగా వ్యాపించిన వేళలో
పోల్చుకోలేని ఆకృతుల వంటివే అయినా,
నీవు వుంటూవున్న, అపరిచితమైన నీ ఊరును
విదకు హత్తుకుని నీ ఇంటికోసం
నలుమూలలూ గాలించాను.
నడచిన త్రోవనే తిరిగి నడుస్తూ,
పలకరించిన వాళ్ళనే మళ్ళీ మళ్ళీ పలకరిస్తూ,
యతనం నీరుగారాక, నియతి చల్లని చూపు మూలంగా
ఎట్టకేలకు నీ ఇంటిని చేరుకొన్నాను

"ద్వారానికో ప్రక్క అమర్చబడిన మీట
తన అస్తిత్వం ఇక ప్రకటించుకుంటుంది;
లేస్తుంది చేయి; కదులుతుంది అనామిక
మెల్లగా చిరుమీటను నొక్కేందుకు;
మోగుతుంది ఘంటిక కింకిణుల అనుకరణంలో:
ప్రతిస్పందిస్తుంది లోనుండి
వేయి జన్మాలుగా విన్న ఓ కంఠం;
'నేను' అని బదులు చెప్పడమే తరువాయి,
తెరుచుకుంటాయి భళ్ళున గేహద్వారాలు;
నిలుస్తావు నీవు నాముందు ఉషస్సులా
నీ రూపం సజీవ శిల్పమై
పలుకరిస్తుంది నాలోని అణువణువును
శబ్దవైభవం నోచని అకించనుణ్ణి
నేనలా శిలలా నిలబడిపోతాను."

మ్రోగింది పదే పదే ద్వారఘంటిక
జీరవోయింది తుదకు మూగవోయింది.
ఊహించిన దేదీ నిజంకాని కారణంగా
ఊహలు తేలాయి గాలిలో దూది పింజల్లా.
ఉస్సురంది మనస్సు;
ఓకాస్త తేరుకుని
అటూ ఇటూ కలయచూశాను.
ప్రాంగణంలో నీవు నాటి పెంచిన తులసి
వసివాడినదిగా అగుపించింది,
హృదయానికి క్రమంగా దూరమై నీ గ్రామం
మొహంజోదారోను తలపించింది.

-**********

"ఏమిటో అది."

"ఐవాంటుడై...."

"అది-మరీ-టూమచ్ కాదూ ?"

"కాదండీ...వన్ మచ్ కూడా కాదు. కనీసం హాఫ్‌మచ్, క్వార్టర్ మచ్ కూడా కాదు. ఎద్దుపుండు కాకికినొప్పా ? నిరుద్యోగి బాధలు - మిగిలినవాళ్లకి తెలీవు. అవి అనుభవైక వేద్యాలే....అందుకే నేనెంత చెప్పినా మీరు కరుగుతున్నట్లులేదు...."

"ఎందుకు కరగడం లేదు?" అన్నాను ఆశగొల్పుతూ. "కరుగుతున్నారా? థాంక్యూ. సర్ మావాడి నిరుద్యోగ బాధలగీతానికితొందరగానేము క్త్రాయింపుకి వొచ్చేస్తాను. మీకు యింటికి వెళ్లే టైమూ.... నాకు.... అతనికి పైకి వెళ్ళిపోయే టైమూ దగ్గర పడుతున్నట్లుంది. చూడండి. నిరుద్యోగి జీవితంలో ఎక్కువ ఎదురు చూసేది పోస్టుమన్ కోసం. పొద్దుటి బీటు.... సాయంత్రపు బీటూ అతనేదో తెచ్చిస్తాడని కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తే - తీరా అతనో రిగ్రెట్ కార్డ్ ముఖాన పడేసిపోతే ఎలా ఉంటుంది? జీవితమంతా రిగ్రెట్ కార్డులే అంటే బతకడందేనికి ? డాక్టర్ ! నిరుద్యోగవైతరణిని ఎవరూ జీవితాంతమూ యీదలేరు. రోజురోజుకి కాల్ లెటర్ ధరా, ఉద్యోగం ధరా పెరిగిపోతూంటే; ఉద్యోగం దొరకదని క్షణ క్షణమూ స్పష్టమైపోతూంటే ... తానందరికీ లోకువైపోతూ.... అమ్మ వేసే దయాధర్మ మెతుకులు తినలేక తింటూ.... నాన్న వేసే ముష్టితో ఎక్కువ ఉద్యోగాలకు ప్రయత్నించలేకపోతూ.... వాళ్ళకి గుదిబండలా.... సమాజానికి బరువుగా.... చిరునవ్వుకి కూడా నోచుకోకుండా.... కనీసపు సుఖాలను కూడా అనుభవించ లేకుండా.... ఏ మనిషయినా ఎన్నాళ్ళు సహనంతో నిరీక్షించగలడు ? బ్రతుకంతా ఎదురు చూపేనా? ఎడారేనా? అందుకే.... ఐవాంటుడై. నా.... మావాడి ఓపిక నశించి పోయింది. ఇంకవాడు ఎదురు చూడలేడు. నేనెక్క వలసిన రైలు - జీవిత కాలం లేటు. అందుకే - నేను చచ్చిపోవాలనుకుంటున్నాను." అతని కళ్ళ నిండా నీళ్ళూ, గొంతునిండా దుఃఖమూ. "ప్లీజ్ ! డాక్టర్ ! మావాడికి ఇథినీషియా...."

"మీరు మరీ మరీ కోరుతున్నారు కనుక అలాగే యిస్తాను. అతని బాధల గాధలు విని నా మనసు కరిగిపోయింది. మీరు నాకు చిన్న సాయం చేసిపెట్టగలరా?

"నేను - నిరుద్యోగిని.. కాని.... ప్రయత్నిస్తాను...." అన్నాడతను.

"ఏమీ లేదు, నాకి హాస్పిటల్‌లో సహాయంగా ఓ మంచివాడు కావాలి. ఎక్కువ పనుండదు. నెలకి మూడువందలివ్వగలను.... అతనిష్టమైనపాళ్లే చెయ్యొచ్చు.

"నేను పనికొస్తానా డాక్టర్?" ఆత్రంగా అడిగేడతను.

"మీరే అయితే - అంతకంటే కావలసిందేముంది? మరీ మంచిది."

మనసులో నవ్వుకుంటూ అన్నాను." రేపటి నుంచే రండి."

"థాంక్యూ డాక్టర్.... థాంక్యూ.... థాంక్యూ వెరీమచ్...."

మర్నాడు తనువొచ్చి పనిలోచేరాడు. ఆరునెలలు పనిచేశాక అతనికి మంచి ఉద్యోగం వొచ్చి - వెళ్ళిపోయాడు. ఆ ఆరునెలలలోనూ అతను మళ్ళీ నన్ను ఇథినీషియా గురించి అడగలేదు. అడగడనీ నాకు ముందే తెలుసు. ఎందుకంటే - నేను మామూలు డాక్టర్‌నే కాను, మానసిక వైద్యుణ్ని కూడా! అతని మిత్రుడు అతనే అని ముందే గ్రహించాను. ●